'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# సాయుధ బలగాల్లో మహిళా వివక్ష

**ఆకాశంలో** సగం.. అన్నింటా సగం అని ఉబ్బేయడమే తప్ప నిజానికి మహిళలకు ఇవ్వాల్సిన స్థానం ఇస్తున్నామా? అనే ప్రశ్న నిరంతరంగా ఎదురవుతూనే ఉంటుంది. చోటివ్వడం మాట అటుంచి ఉల్టా వివక్షకు గురిచేయడం జరుగుతుండటం మనం చూస్తూనే ఉన్నాం. మహిళల ఎదుగుదలకు అడుగడుగునా గండాలే ఎదురవుతుంటాయి. ముఖ్యంగా రక్షణ దళాల్లో. మహిళలంటే అబలలనే అపప్రథ ఉండటమే ఇందుకు కారణమని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. సాయుధ బలగాల్లో మహిళలకు ప్రవేశం విషయంలో ఇటీవల కొంత కదలిక వచ్చిన మాట నిజం. కానీ ఇంకా సాధించాల్సింది ఎంతో ఉందని తెలిపే ఉదంతాలు ఎన్నో వెలుగు చూస్తున్నాయి. తాజాగా వెలువడిన సుప్రీంకోర్టు తీర్పులు ఈ విషయంలో మేలుకొలుపుగా భావించాలి. అందులో మొదటిది అత్యున్నత పదవులకు ఎంపిక, రెండోది వివాహం కారణంగా వివక్షకు సంబంధించినది. భారతీయ తీరప్రాంత రక్షణ దళం (ఐసీజీ)లో స్వల్పకాలిక మహిళా అధికారులకు పర్మనెంట్ కమిషన్ ఇవ్వకపోవడం ఇటీవల చర్చాంశమైన సంగతి తెలిసిందే. ఇదే అంశంపై ప్రియాంక త్యాగి అనే అధికారిణి సుప్రీంకోర్టులో కేసు వేశారు. సదరు కేసు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళా శక్తి అని మాటలు చెప్పడం కాదు.. ఇక్కడ మీరు దానిని అమలు చేసి చూపండి అని సూటిగా నిలదీసింది. 'నౌకాదళంలో పర్మనెంట్ కమిషన్ ఇస్తున్నారు.. మీరెందుకు ఇవ్వరు?' అని కోస్ట్ గార్డును, ప్రభుత్వాన్ని పశ్నించింది. మహిళలను న్యాయంగా చూసే విధానాన్ని మీరు రూపొందించాల్సి ఉంది అని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేయడం గమనార్హం. నారీశక్తి.. నారీ సమ్మాన్ అంటూ అనునిత్యం ఊదరగొట్టే కేంద్రం తన పరిధిలోని ఐసీజీలో మహిళల పట్ల అమలు చేస్తున్న వివక్షను ఎత్తిచూపిన సందర్భమిది. ఇతర బలగాల్లో కీలక స్థానాలకు ఎదిగి దేశరక్షణ బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తున్న మహిళలు కోస్ట్ గార్డులోనూ అంతే సమర్థంగా విధులు చేపట్టగలరని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు మహిళా సమానత్వ సాధనలో మరో మైలురాయిగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

ఇక మరో తీర్పు సంసార బాధ్యతల కారణంగా మహిళలు ఎదుర్కొనే వివక్షకు సంబంధించింది. ఇంటి బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుందన్న కారణంగా మహిళలను ఉద్యోగాల్లోంచి తరిమివేయడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని మాజీ లెఫ్టినెంట్ సెలీనా జాన్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. కేవలం పెళ్లి చేసుకుందన్న కారణంగా పర్మనెంట్ కమిషన్ ఉద్యోగం నుంచి తొలగించడంతో ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సాయుధ బలగాల ట్రైబ్యునల్ లక్నో బెంచ్ ఆమెకు అనుకూలంగా తీర్పు చెప్పినప్పటికీ ప్రభుత్వం దానిపై అపీల్ చేసింది. పెండ్లి చేసుకుందన్న సాకుతో మహిళలను ఇంటికి పంపించి వేయడం మొరటు వివక్ష, అసమానత కిందకే వస్తుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ పితృస్వామిక నిబంధన మానవ గౌరవాన్ని తృణీకరిస్తున్నదని, వివక్షారాహిత్య హక్కు, న్యాయమైన రీతిలో ఉపాధి పొందే హక్కులను ఉల్లంఘిస్తున్నదని మండిపడింది. లింగవివక్ష ఆధారిత చట్టాలు, నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. బాధితురాలికి అన్ని రకాల బకాయిల కింద రూ.60 లక్షల పరిహారాన్ని ఎనిమిది వారాల్లోగా చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించడం కొసమెరుపు.

పైకి తటస్థంగా కనిపించే చట్టం మనకు తెలియకుండానే ఏదో ఒక వర్గాన్ని అణచి వేసేందుకు సాధనంగా ఉపకరించవచ్చు. కానీ అసలైన సమానత్వం కావాలంటే అందులోని నిబంధనలను సామాజిక కోణంలో పరిశీలించాల్సి ఉంటుందని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ మరో సందర్భంలో చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా ప్రస్తావించుకోవడం ఎంతైనా సముచితంగా ఉంటుంది. పైన తెలిపిన రెండు కేసుల్లోనూ సుప్రీంకోర్టు మెట్లెక్కితే గానీ న్యాయం జరగకపోవడం విచారకరం. సర్వోన్నత న్యాయస్థానం సూచించిన విధంగా సమగ్రమైన విధానం రూపొందించుకోవడం కేంద్రానికి తక్షణ అవసరమని చెప్పక తప్పదు.

# ఎన్నికలకు ముందే చేతులెత్తేశారు



బుద్ధా మురళి

దుర్బిణీ వేసి వెతికినా కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలకు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు దేశంలో ఎక్కడా సురక్షితమైన చోటు కనిపించడం లేదు. ఈ విషయాన్ని పరోక్షంగా కాంగ్రెస్ నాయకులే దేశానికి చాటి చెప్పారు. ధీమాగా రంగంలోకి దిగేందుకు వారికి దేశంలో ఎక్కడా నియోజకవర్గాలే కనిపించడం లేదు. కానీ తెలంగాణ కాంగ్రెస్ నేతలు మాత్రం వారిని ఇక్కడి నుంచే పోటీ చేయమని ఎగబడి మరీ పిలుస్తుండటం గమనార్హం. కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ తెలంగాణలోని ఖమ్మం నుంచి పోటీ చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ తీర్మానం చేసింది.

పలువురు నాయకులు ఆమె ఖమ్మం నుంచి పోటీ చేయాలని, రాహుల్‌గాంధీ , ప్రియాంకగాంధీ కూడా తెలంగాణ నుంచే పోటీ చేయాలని కోరారు. సోనియాగాంధీ ఖమ్మం నుంచి పోటీ చేస్తారు, వారు చేయకపోతే తాను ఖమ్మం నుంచి పోటీ చేస్తానని రేణుకా చౌదరి ప్రకటించారు. చివరకు సోనియా రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళుతున్నారు. అంటే లోక్ సభ ఎన్నికల పోటీకి దూరమై పోతున్నారన్న మాట.



**మ**న్మోహన్ సింగ్ రాజ్యసభ ద్వారానే ప్రధానమంత్రి పదవి వరకు వెళ్లారు. రాజ్యసభ ద్వారా పార్టీకి నాయకత్వం వహించడం తప్పేమీ కాదు. కానీ దేశంలో కాంగ్రెస్ పార్టీ ఎంత బలహీనంగా ఉందో దేశానికి తద్వారా చాటి చెప్పినట్టయ్యింది. రాజ్యసభకు వెళతారనే వార్త కన్నా ముందు దేశం మొత్తంలో కాంగ్రెస్‌కు సురక్షితంగా కనిపించిన ప్రాంతం ఒక్క తెలంగాణ మాత్రమేనా అనేది చర్చాంశమైంది. ఇందిరాగాంధీ పార్లమెంటరీ జీవితం రాజ్యసభతో మొదలైతే ప్రస్తుతం కాంగ్రెస్ అగ్రనేత సోనియా రాజకీయ జీవిత చరమాంకంలో రాజ్యసభకు వెళ్తుండటం విశేషం.

ఒకప్పుడు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉండేది. ఇప్పుడు దేశంలో కేవలం మూడు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉంది. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ మాత్రమే కాంగ్రెస్ పాలనలో ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్ కేవలం నాలుగు పార్లమెంట్ సీట్లు ఉన్న చిన్న రాష్ట్రం. అందులో మూడు సీట్లు బీజేపీవి, ఒకటి కాంగ్రెస్‌ది. ఇక కాంగ్రెస్‌కు ఆర్థికంగా అండదండగా నిలిచే స్థాయిలో ఉన్నవి రెండే రెండు రాష్ట్రాలు. ఒకటి కర్ణాటక, రెండవది తెలంగాణ. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరునెలలు దాటి పోయాయి కాబట్టి అక్కడ కొత్త కాపురం మురిపెం తీరిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినప్పటికీ కర్ణాటక పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకే ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలే అవుతోంది కాబట్టి దేశం మొత్తంలో తెలంగాణ కాంగ్రెస్‌కు సురక్షితమైన రాష్ట్రంగా కనిపించడం సహజమే.

గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదాకు అవసరమైనన్ని సీట్లు కూడా రాలేదు. ఈ సారి కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ జోస్యం చెప్పారు. బీహార్ సీఎం నితీష్‌కుమార్ ఎన్నికలకు రెండు నెలల ముందు ఇండియా కూటమి నుంచి బీజేపీ కూటమిలోకి దూకేశారు. కుర్చీ కాపాడుకోవడం, తిరిగి అధికారంలోకి రావడం ముఖ్యం. అందుకు కూటములు మార్చడం, పార్టీలు మార్చడం నాయకులకు పెద్ద కష్టమేమీ కాదు. గత రెండేండ్ల నుంచి ఎన్డీయే కూటమిలో చేరడానికి టీడీపీ అధినేత చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. అమిత్ షా వస్తే రాళ్లదాడితో సత్కరించిన టీడీపీ ఇప్పుడు నరేంద్ర మోదీ అనుగ్రహం కోసం తపిస్తున్నది. మోదీ కుటుంబం మీద సైతం విమర్శలు చేసిన బాబు ఇప్పుడు ఆయన్ని ప్రసన్నం చేసుకోవడానికి వేయని ఎత్తంటూ లేదు. గత ఎన్నికల్లో రాహుల్ గాంధీతో కలిసి చెట్టాపట్టాలేసుకొని తిరిగిన బాబు ఇప్పుడు మోదీ అనుగహిస్తే ఎన్డీయేలో దూకడానికి సిద్ధంగా ఉన్నారు.

> బీజేపీ పాలన అంత అద్భుతంగా ఉందా? కాంగ్రెస్ అధినాయకురాలికి ఓ సురక్షితమైన సీటు కూడా లేనంత అద్భుతంగా బీజేపీ పాలన ఉందా? అంటే అలా ఏమీ లేదు. ఉత్తరాదిలో అధినాయకురాలికి ఒక్క సురక్షితమైన సీటు కూడా చూపించలేని దుస్థితిలో కాంగ్రెస్ ఉంది తప్ప, బీజేపీ పాలన అంత ఘనంగా ఏమీ లేదు.

విదేశాల నుంచి నల్లడబ్బు తీసుకువచ్చి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని, ఇంతకాలం పన్నులు కట్టిన ఉద్యోగులకు వీటి నుంచి కొంత ఇస్తామని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ అమలైపోయి, ప్రజలు సానుకూలంగా ఉన్నారని కాదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి పదేండ్ల పాలనలో 20 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారని కాదు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చి రెట్టింపు చేశారని కాదు. రామరాజ్యం స్థాపించారని కాదు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రధాన హామీలు ఏవీ నెరవేర్చలేదు. అయితే ఎన్నికల్లో బీజేపీకి ఇవేవీ అడ్డంకి కావు. కాంగ్రెస్ నాయకులే బీజేపీకి శ్రీరామరక్ష. హిందూత్వ, పాకిస్థాన్, మైనారిటీలు, అయోధ్య రామాలయం, జై శ్రీరామ్.. ఇవి చాలు బీజేపీని గెలిపించడానికి. జీడీపీ ఎంత పెరిగింది? నిరుద్యోగం ఎంత పెరిగింది? ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు? ఎంత అభివృద్ధి సాధించారు? అనే అంశాలను ఓటర్లు పట్టించుకోరు. రాజకీయ పక్షాలకూ అవసరం లేదు.

ఈశాన్య రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాలు ఇలా దేశంలో ఎక్కడివారైనా ఈ దేశానికి ప్రధాని కావచ్చు. ఇది చెప్పుకోవడానికి బాగుంటుంది. కానీ ఇప్పటివరకు ఈ దేశానికి నాయకత్వం వహించిన వారిలో ఎక్కువమంది ఉత్తరాది నుంచే వచ్చారు. పీవీ నరసింహారావు (తెలంగాణ), దేవెగౌడ (కర్ణాటక) దక్షిణాది నుంచి వచ్చారనేది వేరే విషయం. మన్మోహన్‌సింగ్ రాజ్యసభ నుంచి ప్రధాని అయినా ఉత్తరాది నుంచి అప్పుడు కాంగ్రెస్‌కు లభించిన బలం వల్లనే అది సాధ్యమైంది. ఉత్తరాది నుంచి క్రమంగా కాంగ్రెస్ కనుమరుగైంది. కాంగ్రెస్‌కు నాయకత్వం వహిస్తున్న సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సైతం ఉత్తరాది నుంచి పోటీకి భయపడుతున్నారు. సోనియాగాంధీ రాజ్యసభను నమ్ముకుంటే రాహుల్‌గాంధీ దక్షిణాదిని నమ్ముకున్నారు. ఓడినా గెలిచినా కాంగ్రెస్ నాయకత్వం ఉత్తరాదిని పట్టుకొని అలానే ఉంటే ఇప్పుడు దేశంలో తమకు సురక్షితమైన సీటు ఉన్న రాష్ట్రం ఏది అని చూసే పరిస్థితి వచ్చేది కాదు.

బీజేపీ పాలన వల్ల బీజేపీ దేశంలో పట్టు సాధించడం లేదు. కాంగ్రెస్ తప్పు మీద తప్పు చేస్తూ బీజేపీ బలపడేట్టు చేస్తున్నది . కేవలం రెండు సీట్లున్న బీజేపీ అయోధ్య రథయాత్ర ద్వారా ఈ స్థాయికి చేరింది. హిందువులు 80 శాతం ఉన్న దేశం ఇది. బాబ్రీ మసీదు కూల్చివేత, రథయాత్ర, రామాలయ నిర్మాణం.. ఇవన్నీ రాజకీయమే. రాజకీయ పార్టీలు ప్రతిదానితో రాజకీయం చేస్తాయి. లేకపోతే ఆలయంలో కూర్చొని ధ్యానం చేసి మౌనంగా వెళ్ళిపోతారా? అలా మౌనదీక్ష చేస్తే వారి పార్టీకి ఏం ప్రయోజనం? కూల్చివేతలే కాదు, ఆలయ నిర్మాణం కూడా రాజకీయ ప్రయోజనం ఉండే విధంగానే నిర్వహిస్తారు. అయోధ్య ఆలయ ప్రారంభ కార్యక్రమాన్ని బహిష్కరించడం ద్వారా కాంగ్రెస్ ఆశిస్తున్న ప్రయోజనం ఏమిటో?

> ఆలయ ప్రారంభోత్సవం రాజకీయమే, కాంగ్రెస్ దాన్ని బహిష్కరించడమూ రాజకీయమే. ఎన్నికల ముందు ఆలయాన్ని ప్రారంభించడం ద్వారా ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉంటుందో బీజేపీకే కాదు, దేశం మొత్తానికి స్పష్టత ఉంది. మరి బహిష్కరించడం ద్వారా ఏం ప్రయోజనమో కనీసం కాంగ్రెస్‌కైనా స్పష్టత ఉందా?

అయోధ్య ఆలయ అంశంలో కాంగ్రెస్ ప్రధానులు రాజీవ్ గాంధీ , పీవీ నరసింహారావు పాత్ర కూడా ఉంది. అయితే ఇప్పటి కాంగ్రెస్ నాయకత్వం మాత్రం ఆ క్రెడిట్ మొత్తం పళ్లెంలో పెట్టి బీజేపీకి ప్రధానంగా మోదీకి అప్పగించింది.

> అయోధ్య అంశంలోనే కాంగ్రెస్ పార్టీ పీవీ నరసింహారావును దూరం పెట్టింది. 1991లో ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని అప్పుల ఊబి నుంచి బైటపడేసి ఆధునిక భారత్‌కు పునాదులు వేసిన పీవీకి ఆ తర్వాత ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ కూడా ఇవ్వలేదు . ఏ ప్రధాని మరణించినా ఢిల్లీలో వారికి స్మారక కేంద్రం నిర్మించారు. ఒక్క పీవీ భౌతిక కాయాన్ని మాత్రం హడావుడిగా హైదరాబాద్ పంపించారు. హైదరాబాద్‌లో అంతకన్నా ఎక్కువ హడావుడి పడిపోయి అంత్యక్రియలు నిర్వహించారు. మైనారిటీల కోసం కాంగ్రెస్ పీవీని దూరం పెడితే బీజేపీ సర్కారు ఆయనకు భారతరత్న ఇచ్చింది. పీవీని దూరం పెట్టడం రాజకీయమే, భారతరత్న ఇవ్వడమూ రాజకీయమే.

అయితే ఏ రాజకీయ నిర్ణయం వల్ల ఎలాంటి ఫలితం ఉంటుందో సరిగ్గా అంచనా వేయడంలో కాంగ్రెస్ విఫలమైంది. మైనారిటీల కోసం పీవీని కాంగ్రెస్ దూరం పెడితే మైనారిటీలు గుండుగుత్తగా కాంగ్రెస్ వైపేమీ రాలేదు . కానీ ఈ అంశాన్ని ప్రచారం చేయడం ద్వారా మెజారిటీ హిందువుల మద్దతు కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నది. రెండుసార్లు అధికారం సాధించి, మూడవసారి అధికారంలోకి రాబోతున్నారు అనే నమ్మకం కలిగించడం ద్వారా బీజేపీ ఈ విషయంలో విజయం సాధించినట్టే. పూర్తి మెజారిటీతో విజయం సాధించిన ప్రభుత్వాలనే మోదీ పరివారం కూల్చేయగలుగుతున్నారు. ఇక మోదీకి కంటిలో నలుసుగా మారింది ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం మాత్రమే. ఇప్పటికే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ ఆరుసార్లు నోటీసులు ఇచ్చింది. ఎన్నికల లోపే అక్కడ ఏమైనా జరగవచ్చు. పార్లమెంట్ ఎన్నికల తరువాత ఉత్తరాదిలో హిమాచల్‌ను మినహాయిస్తే కాంగ్రెస్‌కు ఏమీ లేదు. దక్షిణాదిలో ఉన్నది తెలంగాణ, కర్ణాటక మాత్రమే. కాంగ్రెస్ ముక్త్ భారత్ నినాదం ఇచ్చిన బీజేపీ పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ రెండు రాష్ట్రాల్లో చేసే రాజకీయం ఎలా ఉంటుందో చూడాలి. తెలంగాణలో స్థానిక సంస్థల స్థాయిలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య అనుబంధం బాగుంది. బీజేపీ నుంచి వచ్చిన గవర్నర్ బీఆర్ఎస్ ప్రభుత్వంతో ఎడమొగం పెడ మొగంగా ఉన్నారు. శాసనమండలి నామినేటెడ్ స్థానాలకు బీఆర్ఎస్ సూచించిన పేర్లను గవర్నర్ తిరస్కరించారు. వారు సామాజిక సేవకులు కాదు రాజకీయ నాయకులనేది గవర్నర్ అభ్యంతరం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏకంగా ఒక రాజకీయ పార్టీకి అధ్యక్షునిగా ఉన్న వ్యక్తి పేరును గవర్నర్ ఆమోదించారు. ఇప్పటికైతే రాష్ట్రస్థాయిలో బీజేపీ, కాంగ్రెస్ సంబంధాలు బాగానే ఉన్నాయి. ఒకరకంగా మోదీ కాంగ్రెస్‌ను తెలంగాణకే పరిమితం చేశారు అనిపిస్తున్నది. కాంగ్రెస్ ఒక రాష్ట్రస్థాయి పార్టీగా మిగిలిపోతే మోదీకీ మంచిదే. పార్లమెంట్ ఎన్నికల తరువాత కర్ణాటక, తెలంగాణ రాజకీయాలు ఎలా ఉంటాయో చూడాలి.

ఎంత తీయనిదమ్మ మన మాతృ భాష
ఎంత చక్కనిదమ్మ మన తెలుగు భాష

పాలధారల కన్నా మిన్నైన భాష
పొగడపూల కన్నా సొగసైన భాష
అమ్మ ఒడిలోన ఓనమాలు దిద్ది
ఉంగ ఉంగాంటూ ఊసులాడే భాష

పసిపాప నగవుల్లో వెన్నెలలు కురిపించు
గోరుముద్దలలోన మురిపాలు నింపు
తేనెలూరేను తేట తెలుగులోనే
నీటి తేట ఊటై పొంగి పొర్లేను

ఉయ్యాల తొట్టిలో ఓలలాడిన భాష
జోల పాటల్లో పల్లవించిన తెలుగు
ముత్యమై మెరిసేటి ముద్దులొలుకు భాష
అందమైన తెలుగు మన అమ్మ భాష

రమణీయ శ్రవణంతో కమనీయ వచనం
సొగసైన రాగంతో ఎద పలికే గానం
మధుర లిఖితమౌ మన భాష తెలుగు
తలపులోన మెదిలి కవితలెన్నో కూర్చు

పెరటిలో విరిసిన ముద్దబంతుల తీరు
బంగారు వర్ణమై రంగులీను భాష
సంగీత స్వరధనులు శబ్దించు నా భాష
ఆట పాటల్లోన అలలారే తెలుగు
అమ్మ ప్రేమలోని కమ్మదనమంతా
మన భాషకు గాక మరిదేనికుంది

పలుకు పలుకులోన మమతలద్దిన భాష
మమకార మాధుర్యం పండించు తెలుగు
భావ సంద్రమై బాసించు భాష
పలకరింపులతోనే మనసులెన్నో గెలుచు

పరభాషల వెంట పరుగుబెట్టుటయేల
మన భాష మనుగడకు అడుగిడు బాల
దేశభాషలందు తెలుగు లెస్స భళా
ఏ భాషకు లేని ఘనకీర్తి గల తెలుగు

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



నెల్లుట్ల సునీత
79894 60657

> మానవ జాతి అభివృద్ధి చెందుతూ అన్ని రంగాల్లో అగ్రగామిగా ఎదుగుతున్నప్పటికీ నాగరికత మూలాలను, సంస్కృతి సాంప్రదాయాల్ని మరవకూడదు. వాటిని జాతరలు, పండుగల ద్వారా ముందు తరాలకు పరిచయం చేయాలి. పండుగలు, జాతరల ద్వారా సంస్కృతి సంప్రదాయాలను తర్వాతి తరాలకు అందించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. అయితే ఈ విషయంలో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం దక్షిణాదిపై వివక్ష చూపిస్తున్నది. దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలన్న డిమాండ్‌పై మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇది తెలంగాణ ప్రజలను ఆగ్రహానికి, అసంతృప్తికి గురి చేస్తున్నది.

# మేడారానికి జాతీయ హోదా ఎప్పుడు?



కొనుకటి ప్రశాంత్
80084 92700



**భా**రత్ లాంటి భిన్నత్వంలో ఏకత్వం ప్రతిబింబించే దేశంలో అన్ని మతాల వారు కలిసి మెలిసి పండుగలు జరుపుకోవడం ఒక విశిష్ట లక్షణం. కుంభమేళా తర్వాత అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే మేడారం జాతర ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా గుర్తింపు పొందింది. భక్తుల చిరకాల కోరికైన మేడారం జాతరకు జాతీయ హోదా కేంద్రం చిన్నచూపుతో ఇంకా కలగానే ఉంది. ఇప్పటికే ఏ నోట విన్నా మేడారం ముచ్చట్లే. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా, విన్నా మేడారం జాతర సందడి కనిపిస్తున్నది. ఫిబ్రవరి 21న మొదలయ్యే మేడారం జాతర నాలుగు రోజుల పాటు కొనసాగుతుంది. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ జాతర గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. కుంభమేళా తర్వాత అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే ఈ జాతరకు తెలంగాణలో పాటు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్, మహారాష్ట్ర, ఒరిస్సా తదితర పొరుగు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుండి కూడా భక్తులు, సందర్శకులు తరలి వస్తారు. లక్షలాది మంది జనంతో ఆ నాలుగు రోజులు మేడారం వనమంతా జన సంద్రంగా మారుతుంది. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిచ్చే క్రమంలో స్వరాష్ట్రంలో బోనాలు, బతుకమ్మలను రాష్ట్ర పండుగలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించింది. ఆ క్రమంలోనే 2014లోనే మేడారం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించి తెలంగాణ సంస్కృతి, పండుగల వైభవానికి కృషి చేసింది.

> మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం గట్టిగా ప్రయత్నించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుండి కనీస స్పందన లేకుండా పోయింది. ఉత్తరాది రాష్ట్రాలకు సంబంధించిన పండుగలకు, జాతరలకు జాతీయ హోదా కల్పిస్తున్న బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపుతున్నది. గంగ, ప్రయాగ కుంభ మేళాలకు జాతీయ హోదా ఇచ్చిన మోదీ సర్కార్ తెలంగాణలో జరుగుతున్న మేడారం గిరిజన జాతరను విస్మరించింది.

గతంలో కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి హోదాలో మేడారం జాతర సందర్శించిన అర్జున్ ముండా మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించడం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినప్పటికీ అది అమలుకు నోచుకోలేదు. కుంభ మేళాలకు కోట్లాది రూపాయలు కేటాయించే కేంద్రం తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరకు తగిన నిధులు కేటాయించకపోవడంపై తెలంగాణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్న తెలంగాణ బిడ్డ కిషన్ రెడ్డి మేడారం జాతరకు జాతీయ హోదా తీసుకురావడంతో పాటు కేంద్ర నిధులు వచ్చేలా కృషి చేయాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నప్పటికీ ఆయన నుంచి తగిన ప్రయత్నం కనిపించడం లేదు. ఈ ఏడాది జరిగే మేడారం జాతర అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా రూ.100 కోటన్లు కేటాయించి చేతులు దులుపుకుంది. కేంద్రమైతే ఈసారి నయా పైసా నిధులు కూడా కేటాయించకపోవడం బాధాకరం. తెలంగాణ నుండి బీజేపీ, కాంగ్రెస్‌ల తరపున లోక్‌సభలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు మేడారం జాతరకు నిధుల సాధనపై దృష్టి సారించకపోవడం వారి చిత్తశుద్ధి లేమిని నిరూపిస్తున్నది.

మేడారం జాతరకు వచ్చే భక్తుల మనోభావాలను, రాష్ట్ర ప్రజల అభ్యర్థనను గౌరవించి కేంద్రం వెంటనే మేడారానికి జాతీయ హోదా కల్పించాలి. కనీసం రూ.200 కోట్ల నిధులు కేటాయించాలి. ఆదివాసీలను ఎన్నికల్లో ఓటు బ్యాంకులాగా మాత్రమే చూడకుండా వారి పండుగలు, జాతరలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నాగరికతకు మూలమైన వారి ఆచారాలను గౌరవించాలి. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 9.3 శాతంగా ఉన్న ఆదివాసీ గిరిజనుల పట్ల చిత్తశుద్ధి ప్రదర్శించడమే కేంద్ర ప్రభుత్వ తక్షణ కర్తవ్యం కావాలి.

# నిస్వార్థ నాయకుడు



నేడు భూపతి కృష్ణమూర్తి జయంతి

> దేశ స్వాతంత్ర్యం కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం నిస్వార్థంగా పోరాటం చేసిన నాయకుడు భూపతి కృష్ణమూర్తి. ఏ పదవులు ఆశించకుండా సొంత ఆస్తులను సైతం ఉద్యమాల కోసం ధారపోసిన త్యాగశీలి ఆయన. అభిమానులు తెలంగాణ గాంధీగా పిలుచుకొనే ఆయన జీవితమంతా పోరాటాలమయం.. భావి తరాలకు ఆదర్శప్రాయం.

**క**రీంనగర్ జిల్లా ముల్కనూర్‌కు చెందిన భూపతి కృష్ణమూర్తి 1926 ఫిబ్రవరి 21న వరంగల్‌లో జన్మించారు. 1944లో మహాత్మాగాంధీ జన్మదినోత్సవం సందర్భంగా కృష్ణమూర్తి జాతిపితతో పది రోజులు గడిపారు. గాంధీజీ స్ఫూర్తితో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. 1946 ఆగస్టు 11న హయగ్రీవాచారితో కలిసి ఓరుగల్లు కోట మీద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అదే సమయంలో రజాకార్ల దాష్టీకాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నారు. 1947-48 మధ్య కాలంలో హైదరాబాద్ విమోచన పోరాటంలో చురుగ్గా పాల్గొని అజ్ఞాత జీవితం గడిపారు. 1948లో జరిగిన గంథాలయోద్యమంలో సైతం పాల్గొన్నారు. ఇడ్లీ - సాంబార్ వ్యతిరేక ఉద్యమంలోనూ క్రియాశీలకంగా పనిచేశారు. 1952లో భూపతి కృష్ణమూర్తి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర నినాదాన్ని ప్రచారం చేశారు. 1953-54లో ఫజల్ అలీ కమిషన్ వరంగల్ వచ్చినప్పుడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం డిమాండ్‌ను బలంగా వినిపించారు. తెలంగాణను ఎట్టి పరిస్థితుల్లోనూ వేరే ప్రాంతంతో కలపొద్దని అవిశ్రాంతంగా పోరాటం చేశారు. వయోభారంతో బాధ పడుతున్నప్పటికీ 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించారు.

1967లో వరంగల్ మున్సిపల్ కౌన్సిలర్‌గా భూపతి కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సాధ్యం కాదేమోనని నమ్మకం సన్నగిల్లుతున్న సమయంలో యువకులు, మేధావులతో కలిసి తెలంగాణ ప్రజా సమితి ఏర్పాటు చేసి తెలంగాణవాదుల్లో మరోసారి ఆశను రేకెత్తించారు. 1970-74లో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ సర్కిల్ సలహా మండలి సభ్యునిగా పనిచేశారు. 1982 జనవరి 19న కార్మిక సంఘాల జాతీయ సమన్వయ సంఘం నిర్వహించిన భారత్ బంద్‌లో పాల్గొని అరెస్టై వారం రోజుల పాటు జైలు జీవితం అనుభవించారు.

సమాజంలో ప్రతి ఒక్కరూ ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో 1953లో ముల్కనూరు కో-ఆపరేటివ్ సొసైటీని స్థాపించి వ్యవస్థాపక అధ్యక్షునిగా పనిచేశారు. ఈ సంఘాన్ని ఆసియా ఖండంలోనే ఆదర్శంగా, అతి పెద్ద సహకార సంఘంగా తీర్చిదిద్దారు. వరంగల్ వ్యవసాయ గ్రేన్ మార్కెట్ సభ్యునిగా, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అడ్హక్ అధ్యక్షునిగా, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శిగా సేవలందించారు. వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా; వరంగల్ పట్టణ, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన కృషి ఫలితంగా వరంగల్‌లో పలు విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయి. 1982 నుంచి 1985 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం సెనేట్ సభ్యుడిగా కృష్ణమూర్తి పనిచేశారు. ఆయన పోరాట స్ఫూర్తికి గుర్తింపుగా స్వతంత్ర సమర కేసరి, కాళోజీ అవార్డులు లభించాయి. జీవితాంతం మహాత్మా గాంధీ సిద్ధాంతాలను ఆచరించిన భూపతి కృష్ణమూర్తి తాను కల గన్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కండ్లారా చూసి 2015 ఫిబ్రవరి 15న వరంగల్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన నిస్వార్థ పోరాట మార్గం మనకందరికీ స్ఫూర్తిదాయకం.

\- బుద్ధా ప్రవీణ్, 95053 25253